చదువుల గారడీ

ఆంధ్రప్రదేశ్‌లో ఓ తమాషావుంది.

అదేమిటంటే ఎప్పుడూ ఏదోవొక తమాషా జరుగుతూనే వుండడం. హఠాత్తుగా జర్నలిస్టులను చావగొట్టి వాళ్ళ కెమెరాలు విరగ్గొటటం పోలీసులకు ఒరోజు తమాషా అయితే, పోలీసులను నక్సలైట్స్ కిడ్నాప్ చేసుకెళ్ళటం మరో రోజు తమాషా! ఎంట్రెన్స్ పరీక్షల్లో కొశ్చెన్ పేపర్లు తెగ లీక్ అవటం ఓరోజు తమాషా! దేశంలోని నగరాలు మేయర్లందరూ రోడ్లు ఊడవటం ఓ రోజు తమాషా అయితే అసలు రోడ్లనేవే కనిపించకుండా పోవటం నగరంలోని చాలా లోకాలిటీల్లోని మరో తమాషా!

మన ప్రజలు ఈ తమాషాలన్నిటికీ 'ఇమ్యూన్' అయిపోయారనుకుంటే మా కాలనీ వాళ్ళూ ఇంకో అడుగుముందుకెళ్ళి వాటికి 'ఎడిక్ట్' అయిపోయారు.

రోజూ ఏదో ఒక వింతగానీ, ఏదో ఒక తమాషాగాని జరగకపోతే కాలనీలో ఎవరికీ మనశ్శాంతి వుండదు. నిద్రపట్టదు. తిండి సయించదు– అహహ! సారీ! తిండిబాగానే సయిస్తుంది.

ఎడిక్షన్ తీవ్రత తాలూకూ ప్రథమవిక్టిమ్ మా కాలనీ కమిటీ ఆర్గనైజింగ్ శెక్రటరీ శాయీరామ్.

ఆదివారం అందరం ఇంకా నిద్రయినా లేవలేదు. ఈలోగా పెద్దగా ఓకుర్రాడి ఏడుపూ, వాడి వెంటపడి కొంతమంది పెద్దాళ్ళు వాడిని చావగొట్టటానికి చేస్తున్న ప్రయత్నం మాకంపడింది. మేమంతా సంగతేమిటో కనుక్కుందామని వెళ్ళేసరికే శాయీరామ్ ఆ కుర్రాడినీ, అతని కుటుంబ పెద్దలనూ వేరుచేసి ఆ కుర్రాడిని కొట్టవద్దని వారికి నచ్చ జెప్తున్నాడు.

"ఏం జరిగింది?" ఆవేశంతో ఊగిపోతున్న ఆ కుర్రాడితండ్రి శంకర్రావ్‌నీ, అతని బాబాయినీ అడిగాము.

"ఇంకేం జరిగాలండీ! ఈగాడిద కొడుకు మేము భయపడినంత పనీ చేశాడు" కసిగా అన్నాడు శంకర్రావ్.

"ఏం చేశాడు? దొంగతనం చేశాడా?" అడిగాడు శాయీరామ్.

శంకర్రావ్ శాయీరామ్ వేపు పిచ్చాడిని చూసినట్లు చూశాడు.

"దొంగతనం చేస్తే మేమెందుకు కొడతామయ్యా! అదేం తప్పుపనా? బోఫోర్స్ కుంభకోణాలూ, నాచారం కుంభకోణాలూ, హెల్మెట్ భాగోతాలూ, రామకృష్ణాస్టూడియో పన్ను మినహాయింపులూ- వీటిముందు దొంగతనాల్ని ఇంకదొంగతనాలని ఎవడంటా డయ్యా?" కోపం అణచుకుంటూ అన్నాడు.

"పోనీ ఎవరితోనయినా కొట్లాడాడా?" అనుమానంగా అడిగాడు రంగారెడ్డి .

"ఏమిటి? కొట్లాడితే మేము గొడవ చేయటానికి పిచ్చాళ్ళమనుకున్నారా? అసెంబ్లీలో, పార్లమెంటులో కొట్లాటలు, మర్డర్ ప్రయత్నాలూ, వీటిముందు వీధి కొట్లాటలేముందయ్యా? వీటిల్లో ఏం తప్పుందని?" మరింత రెచ్చిపోతూ అడిగాడు శంకర్రావ్.

"ఒకవేళ ఏ అమ్మాయినయినా మానభంగం లాంటిది చేశాడా?" హాస్యంగా అడిగాడు జనార్ధన్.

"ఏయ్! ఏం మాట్లాడుతున్నావయ్యా! మానభంగం చేస్తే నేనెందుకుకొడతాను? మావాడు ఎమ్మెల్యే అయ్యే రోజొచ్చిందని మురిసిపోతాను! జయలలితను అసెంబ్లీలో మానభంగం చేయడానికి ఎమ్మెల్యేలు ప్రయత్నించినప్పటినుంచీ అది నేరం కాదని ఋజువయిపోయింది కదా! అలాంటి పనులేం చేసినా నెత్తినా పెట్టుకుని పూజించేవాళ్ళం. కానీ వీడు వాటన్నింటింకంటే దారుణమయిన ఘోరం చేశాడండీ!"

"అంటే ఏం చేశాడు?"

"టెన్త్‌క్లాస్ పాసయ్యాడండి! ఇదిగో చూడండి మార్క్సులిస్టు! ఇవాళేవచ్చింది! అసలు వీడిని టెన్త్‌లో చేర్చవద్దే, ఆ దిక్కుమాలిన కంప్యూటర్ మనరాష్ట్రంలో అందరినీ ముందు ఫెయిల్ చేసి, రివాల్యుయేషన్‌కి అప్లయ్ చేశాక అందరినీ ఫస్ట్‌క్లాస్‌లో పాస్ చేస్తుందే అని మా ఆవిడతో మొత్తుకుంటూనే ఉన్నా! వింటేనా? వినకుండా వాడిని వెధవగారాంతో టెన్త్‌లో చేర్పించింది! ఈ దౌర్భాగ్యపు వెధవ ఇప్పుడు ఫస్ట్‌క్లాస్‌లో పాసయి అఘోరించాడు" మేమంతా శంకర్రావ్‌మీదా, ఆపక్కనే నిలబడి కళ్ళొత్తుకుంటున్న అతని భార్యమీదా జాలిపడ్డాము.

"పోనీలేండి! జరిగిందేదో జరిగిపోయింది. పాసయి పోయాక ఇప్పుడింక ఎవరు మాత్రం ఏం చేయగలం?" ఓదారుస్తూ అన్నాడు రంగారెడ్డి.

"నేనూ అలాగే అనుకున్నానండీ! ఛస్తే చావనీ అని వదిలేద్దామనుకున్నాను. కానీ ఏం జరిగింది? ఇప్పుడు కాలేజీలో చేరతానని కూర్చున్నాడు" అందరం ఉలిక్కిపడ్డాం.

"ఏమిటి? కాలేజీలో చేరతానంటున్నాడా? వీడికేంపోయేకాలమొచ్చింది" ఆడవాళ్ళం దరూ మెటికలు విరిచారు.

ఆ కుర్రాడి తల్లి కూడా భోరున ఏడ్చేయసాగింది.

"నిన్న రాత్రినుంచీ ఇదే వరుస పిన్నిగారూ– కాలేజీలో చేరతా అని ఒకటే గొడవ. ఇంక వీడెలా బతికి బట్టగడతాడు?" ఏడుస్తూనే అందామె.

రంగారెడ్డి ఆ కుర్రాడి దగ్గరకు నడిచాడు.

"ఏదోపాపం తెలీని వయసు! ఈ వయసులో అందరూ ఇలాగే తప్పులు చేస్తుంటారు. మనందరం నచ్చజెప్తే వాడే తెలుసుకుంటాడు లెండి– ఏరా రమణా? ఈ రోజుల్లో చదువులేమిట్రా? తప్పుకదంట్రా? మీవంశం ఎలాంటిది? మీనాన్నగారు వాళ్ళ పెద్దల మాట వినకుండా చదువుకోబట్టేకదా ఈనాడిలా అడుక్కు తినే పరిస్థితిలో ఊరి బయటపడున్నారు? మేమంతా కూడా మా పెద్దల మాట విని చదువుకునే కదా! ఇవాళ ఈ కుక్క బ్రతుకు బ్రతుకుతున్నాము?" అతనికి నచ్చచెప్పబోయాడు ప్రేమగా.

వాడికి ఏడుపొచ్చేసింది.

"నేను చదువుతానంకుల్! నాకేం డబ్బు ఖర్చుచేయనక్కర్లేదు. నాకు అన్ని కాలేజీ ఎంట్రెన్సుల్లోనూ ఫస్ట్‌రాంక్ వచ్చింది. చదువంతా గవర్నమెంట్ స్కాలర్‌షిప్‌తోనే చదివేయగలను–" అన్నాడు ఏడ్చేస్తూ. యాదగిరి వాడి భుజం మీద చేయివేశాడు ఆదరంతో.

"ఒరేయ్ రమణా! గవర్నమెంట్ సంగతి నీకెరుకలేదురా! గిట్లనే నీ స్కాలర్‌షిప్‌లని, స్పెషల్ కోటాసీట్లనీ పోరగాండ్లకు ఆశపెట్టి కాలేజీల సదివేట్లుజేస్తరు. కొనాకు ఈ చదువుకున్నోడ్లేంజేస్తరు? అడుక్కుతినానికి గూడా పనికిరారన్నట్లు! సమజయిందా?

ఎంతమందిని సూడటం లేదురా నువ్? మొన్నే గదా మన కాలనీలో ఎమ్మే సదివినోడు కోడిగుడ్లు వాడితాన కొనమని అందరినీ బ్రతిమలాడిండు! గుర్తులే?"

యాదగిరి మాటలు కూడా వాడిలో ఎలాంటి చలనం కలిగించలేదు.

"నాకేం? నేను కాలేజీలో చేరతా? నాకు చదవాలని ఉంది" అన్నాడూ మళ్ళా మొండిగా.

శంకర్రావ్‌కి కోపం వచ్చింది.

"అరె నీయవ్వ- మళ్ళీ అదేమాట మాట్లాడతావు? చదువులేనోళ్ళు ఎంత మంచిగా బ్రతుకుతున్నారో చూసి కూడా బుద్ధి తెచ్చుకోవేరా?" అంటూ రెండు వేసేసరికి రంగారెడ్డి అతనికి అడ్డువెళ్ళాడు.

"ఒరే రమణా! మనదేశ చరిత్రంతా ఓసారి చూడరా! 'కింగ్‌మేకర్' అని పేరున్న కామరాజ్ నాడార్ ఏం చదివాడ్రా? అతనికి రాయటం, చదవటం రెండూరావ్ కదురా! అయినా రాజుల జాతకాలు రాశాడు. అవునా? అందాకా ఎందుకు? మన ఎక్స్ చీఫ్ మినిష్టర్ అంజయ్య నీలాగా చదువుకునివుంటే చీఫ్ మినిష్టర్ అయ్యేవాడా? మన రాష్ట్రాన్ని మిగతా చదువూకున్న చీఫ్ మినిస్టర్లంకంటే బాగా పరిపాలించ గలిగేవాడా? మనకాలనీలో ప్రెసిడెంట్ మెడల్ సంపాదించిన ఇంజనీర్ ఏంచేస్తున్నాడు? వేలిముద్రలు వేసే కంట్రాక్టర్ కింద రోజు కూలీలెక్కన పనిచేస్తున్నాడు కదా" ఏకధాటిగా స్పీచ్ ఇచ్చాడు.

"అందాకా ఎందుకురా! నువ్వు చదివిన స్కూల్స్, కాలేజీలు ఎవరివనుకున్నావ్? ఒకటో క్లాస్‌గూడా చదువని సారా కంట్రాక్టర్‌వి! మరి వాడికిందే ఎమ్.ఏ. పిహెచ్‌డీలూ, ఎమ్మెస్సీ బి.ఇడీలూ, ఎమ్.కామ్‌లూ, పనిచేస్తున్నారా లేదా? నువ్ ఎగబడి చూసే సినిమా డైరెక్టర్లూ, ప్రొడ్యూసర్లూ ఎంతమంది చదువుకున్నారనీ? మనదేశం మొత్తం మీద ఎమ్మెల్యేలు ఎంపీలలో అక్షరం ముక్కరాని వాళ్ళే ఎక్కువమంది ఉన్నారన్న విషయం తెలుసా నీకు? వాళ్ళు రకరకాల కమిటీలకు హెడ్స్‌గా పనిచేస్తూ మనదేశ భవిష్యత్తుని నిర్ణయించటం లేదూ?" తనూ కల్పించుకుంటూ అన్నాడు గోపాల్రావ్.

"ఆ మాట కొస్తే చాలా పత్రికల ఎడిటర్లకూ, కొంతమంది తెలుగు రచయితలకూ ఒక్కలైన్ రాయటం కూడా రాదు. అయినా వాళ్ళను మన తెలుగు ప్రజలు పైకెత్తేసి జేజేలు కొట్టటం లేదూ? బాగా చదువుకుని ఉంటే పాపం వాళ్ళ గతేమయి ఉండేది?" అంది రాజేశ్వరి.

ఆ కుర్రాడు ఆలోచనలో పడ్డాడు.

"మామాట వినరాబాబూ! గొప్ప గొప్ప వ్యాపారస్తులూ, లక్షాధికారులూ, కోటికి పడగలెత్తిన వారూ మెజారిటీ ఏబిసిడీలు రాని వారేరా! క్రిమినల్ 'ప్రొసీజర్' కోడ్ అనే

లావుపాటి పుస్తకాలు చదివి సమాజంలోని రుగ్మతలన్నీ అదుపులో పెట్టాల్సిన పోలీసుల్లో నూటికి డెబ్బైమంది చదువురాని వారేరా! ఎవరిక్కావాల్రా చదువు?" అంది వాళ్ళమ్మ.

"వాటి సంగతలా వుండనీ! నువ్ చదువులేని వాడవయితే మన ప్రభుత్వం నీకు ఎన్ని రకాల రాయితీ లిస్తుండో ఒక్కసారి చూడు! జనార్థన్ పూజారి స్కీం ప్రకారం చదువూ సంధ్యా లేకుండా పనిపాటా చేయని వాళ్ళందరికీ ప్రతి సంవత్సరం అయిదువేలు ఉచిత లోన్ దొరుకుతుంది. ప్రతి బాంక్‌లోనూ రకరకాల మారుపేర్లతో ఎన్నో వందలసార్లు లోన్లు తీసుకుని ఎగ్గొట్టవచ్చు! నీలాంటి వాళ్ళందరికీ గవర్నమెంట్ స్థలాలు ఆక్రమించుకునే హక్కు మన ప్రభుత్వం ఇస్తుంది. అంటే అలాంటి స్థలాలు సంవత్సరానికి ఒకటి ఆక్రమించుకుని పట్టా దొరగ్గానే అమ్మేసుకుని డబ్బు చేసుకోవచ్చు. ఇదికాక బలహీనవర్గం అని చెప్తే సంవత్సరానికో ఇల్లుకూడా ప్రభుత్వం నీకిస్తుంది. అదీ అమ్మేసుకోవచ్చు. ఇదీగాక నీ ఓటుని అన్ని రకాల ఎలక్షన్‌లకూ కలిపి అయిదేళ్ళకు టోకున ఏ పదివేలకో ఏదో ఒక పార్టీకి అమ్మేసుకోవచ్చు" చెప్పాడు రంగారెడ్డి.

"ఇప్పుడు నెహ్రూ రోజ్‌గార్ యోజన స్కీమ్‌లో యింకెంత డబ్బు ముడుతుందో తెలీదు. ఎలక్షన్లలోగానే ఎన్టీఆర్ రోజ్‌గార్ స్కీమ్ ఒకటి ప్రవేశపెడితే ఇంక నీకూ డబ్బుకేం కొదవ చెప్పు!" నచ్చజెప్ప సాగాడు గోపాల్రావ్.

"గ్రీన్‌కార్డ్ హోల్డర్ వయితే నీకెన్ని సౌకర్యాలుంటాయో తెలుసా? నిజామ్ హాస్పిటల్, అపోలో హాస్పిటల్ లాంటి అతి ఖరీదయిన ఆస్పత్రులలో ఉచితంగా వైద్యం, కిలో రెండ్రూపాయల బియ్యం, అతిచౌకగా బట్టలు- ఇంతకంటే ఇంకేంకావాల్రా నీకు?" అన్నాడు రంగారెడ్డి.

వాడిలో సంచలనం కలిగింది.

"మీరు చెప్పింది నిజమేననుకో" అన్నాడు నెమ్మదిగా.

అందరికీ ఒక్కసారిగా నెత్తిమీద బరువుదింపినంత సంబరమయింది.

శంకర్రావు కొడుకుని కౌగిలించుకున్నాడు.

"ఎంతమంచివాడివిరా నువ్వు! ఎంత త్వరగా అర్థం చేసుకున్నావు?" అన్నాడు ఆనంద భాష్పాలు రాలుస్తూ.

"కానీ నాకు పెద్ద పదవుల్లోకెళ్ళే ఛాన్స్‌పోతుంది కదా అంకుల్?" రంగారెడ్డినడిగాడువాడు.

"ఏ పదవులు కావాలనుకుంటున్నావ్ నువ్వు?"

"ఐ.ఏ.ఎస్. ఐ.పి.ఎస్. లాంటివి."

అందరూ ఘొల్లున నవ్వారు.

"పిచ్చివాడా! ఆ పదవులన్నిటికన్నా పై పదవిని చాలా తేలిగ్గా ఎలాంటి చదువూ లేకుండా సంపాదించవచ్చురా?" అన్నాడు రంగారెడ్డి.

"ఎలా?"

"ఎలాగేముంది? రాజకీయ నాయకులకు పాదాభివందనం చేస్తే చాలు! నాలుగయిదేళ్ళు అలా శ్రమపడ్డావంటే పెద్ద పదవి తప్పదు– న్యూస్‌పేపర్లలో ఆ ఫోటోలు చూడలే నువ్వు?"

రమణ మొఖంలో చిరునవ్వు కనిపించింది.

"అయితే సరే! నేను కాలేజీలో చేరను డాడీ!" అన్నాడు నిర్ణయించుకున్నట్టు. శంకరయ్య, అతని భార్య, రమణను ఆనందంగా ఇంటికి తీసుకెళ్ళిపోయారు. మేమంతా కూడా తేలికయిన హృదయాలతో ఎవరిళ్ళకు వాళ్ళు బయల్దేరాం.